Eenadu DL 02/04/17.



మెట్రో రైలు పనుల్లో కీలక ప్రాంతాల్లో ఆస్తుల సేకరణకు ఎట్టకేలకు మార్గం సుగమం అయ్యింది. మూడేళ్లుగా కోర్టు కేసులతో నానుతున్న సేకరణ ప్రక్రియ తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాలతో వేగిరం కానుంది. కారిడార్-1లో నాంపల్లి, మియాపూర్ వద్ద కోర్టు కేసుల కారణంగా నిల్చిపోయిన 11 ఆస్తులను హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ పాత భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోనుంది.



## మెట్రో ఒకటో మార్గం పూర్తికి..

# తొలగిన అడ్డంకులు

నాంపల్లి, అమీర్‌పేటలో ఆస్తుల సేకరణకు మార్గం సుగమం

రెండు, మూడు మార్గాల్లో మిగిలిన సేకరణ

ఈనాడు, హైదరాబాద్

మూడు మార్గాల్లో జరుగుతున్న 66 కి.మీ. మెట్రో పనుల్లో 63 కి.మీ. పునాదులు తవ్వగా.. 61 కి.మీ. స్తంభాలు పూర్తయ్యాయి. మిగిలిన స్వల్పదూరంలో రైట్ ఆఫ్ వే(రహదారిపై మెట్రోకి అవసరమైన స్థలం) లేకపోవడంతో పునాదులు పడలేదు. ఆస్తులు కోల్పోతున్న బాధితులు తగిన పరిహారం కోరుతూ కోర్టులను ఆశ్రయించడంతో ఆయా చోట్ల సేకరణ ప్రక్రియ ఇన్నాళ్లు నిల్చిపోయింది.

**ఇదీ వివాదం..**

హైదరాబాద్ మెట్రోరైలు కారిడార్-1 మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు వెళుతోంది. 29 కి.మీ.ల ఈ మార్గంలో అమీర్‌పేట, నాంపల్లి వద్ద మెట్రో పనులు మిగిలాయి. నాంపల్లిలో రైట్ ఆఫ్ వే లేకపోవడంతో 2013లో 20 ప్రైవేటు ఆస్తులను సేకరించడానికి అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. హైదరాబాద్ కలెక్టర్ 2013 జులై 9న దీనిపై ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అదే నెల 19న డ్రాఫ్ట్ డిక్లరేషన్ జారీ చేశారు. 2013 డిసెంబరు 23న అవార్డును ప్రకటించారు. పరిహారాన్ని తీసుకుని ఆస్తులను ఖాళీ చేయాలని స్థలం యాజమానులకు మెట్రో అధికారులు 2014 జులై 26న సమాచారం అందించారు. 2014 జనవరి 1 నుంచి కొత్త భూసేకరణ చట్టం అమల్లోకి వచ్చిందని దాని ప్రకారం పరిహారం చెల్లించాలని, అంతవరకు తమను ఖాళీ చేయకుండా ఆదేశాలివ్వాలని పలువురు భవన యాజమానులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై రెండేళ్లుగా వాదనలు, ప్రతివాదనలు నడిచాయి. నెల రోజుల క్రితం హైకోర్టు దీనిపై ఆదేశాలు ఇచ్చింది. కొత్త చట్టం ప్రకారమే పరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సమస్య పరిష్కారమైందని అంతా భావించారు. కొత్త చట్టం ప్రకారం పరిహారం చెల్లించినా రూ.5 కోట్లలోపే ఉండటంతో ప్రభుత్వానికి పెద్ద భారం కాదని.. మెట్రో పనులకు అడ్డంకులు తొలగినట్లేనని అనుకున్నారు. మెట్రో ఆస్తులకు కొత్త చట్టం ప్రకారం చెల్లించడానికి అభ్యంతరం లేకపోయినా.. వేర్వేరు అభివృద్ధి పనులకు పలుచోట్ల సర్కారు సేకరిస్తున్న భూసేకరణపై ప్రభావం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తాజాగా సుప్రీం ఆదేశాలు సర్కారుకు అనుకూలంగా రావడంతో పాత భూసేకరణ చట్టం ప్రకారమే పరిహారాన్ని వడ్డీతో సహా చెల్లించి ఆస్తులను హెచ్ఎంఆర్ స్వాధీనం చేసుకోనుంది. దీంతో కారిడార్-1కి ఆటంకాలు తొలగినట్లేనని అధికారులు భావిస్తున్నారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి పరిహారం చెల్లించి నాంపల్లి, అమీర్‌పేట వద్ద మిగిలిపోయిన 11 ఆస్తులను వెంటనే స్వాధీనం చేసుకుంటాం. పనుల వేగాన్ని పెంచుతాం' అని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. కారిడార్-1లోని మొత్తం 29 కి.మీ. ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని మెట్రో ఇప్పటికే ప్రకటించింది.

**మిగతా చోట్ల మాటేమిటి..**

మిగతా రెండు కారిడార్లలో మరో 29 ఆస్తులను సేకరించాల్సి ఉందని మెట్రో అధికారులు అంటున్నారు. ఈ ప్రక్రియ జాప్యంతో మెట్రో పనుల పూర్తిపై ప్రభావం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆస్తుల సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని పదేపదే అధికారులను ఆదేశిస్తున్నారు.

- కారిడార్-3 నాగోల్ నుంచి హైటెక్‌సిటీ మార్గంలో కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్‌లో కొన్ని ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఇక్కడ పనులు పూర్తయితేనే ఈ ఏడాది ఆఖరి నాటికి హైటెక్‌సిటీ వరకు మెట్రో ప్రారంభిస్తామనే అధికారుల మాటలు వాస్తవ రూపం దాలుస్తాయి.
- కారిడార్-2 జేబీఎస్ నుంచి ఇమ్లీబన్ మార్గంలో సుల్తాన్‌బజార్, బడీచౌడీలో ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఇక్కడ స్తంభాలు నిర్మించినా వయాడక్ట్ ఏర్పాటు చేయాలంటే ఇరువైపులా భవనాలను కొంత దూరం కూల్చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నినాదంగా సాగుతోందని విమర్శలు ఉన్నాయి. బాధితులతో చర్చలు జరుపుతున్నట్లు అధికారులు అంటున్నారు.